# గుండె గుండెకో దీపం

## (నాటిక)

బి.వి. రమణారావు

### రంగస్థలం

ఒక ఇంట్లో రెండువాటాలకి మధ్య ఉన్న ఉమ్మడి చావడి. ఓ వాటా లో మంజులా, తండ్రీ ఉంటారు. ఎదురు వాటాలో కొండా ఉంటాడు. హాలు మధ్య ఓ టేబుల్, దానివెనక మంజుల కూర్చునే రివాల్వింగ్ ఛెయిర్. ముందో నాలుగు కుర్చీలు. టేబుల్ మీద బుక్ స్టేండ్, ఫోన్, ఇతర పరికరాలు. కొండా వాటా కెళ్ళే ద్వారం ముందు ఓ పాత ఈజీ ఛెయిర్ ఉండేది. కొండా ఆ వాటాలో ప్రవేశించేక దాని స్థానే మరో మంచి కుర్చీ ఉంటుంది.

### పాత్రలు

1.మంజుల (24 సం॥): మంచిపేరు తెచ్చుకున్న నవలారచయిత్రి. విప్లవవాది.

2.కొండా (ఉరఫ్ చలం) (26సం॥): స్వయంకృషితో పైకొచ్చిన యువకుడు. ఆశావాది.

3.గోపాలకృష్ణయ్య (55): మంజులతండ్రి. స్థితిపరుడు. సాధుస్వభావుడు.

4.జానకి (30సం॥): తీర్చలేని అప్పులతో సతమతమవుతున్న మధ్యతరగతి గృహిణి.

5.కామేశం (17సం॥): పేదవిద్యార్థి. తెలివైనవాడు. చురుకైనవాడు.



6.ఆనందరావు(55): తన పరువు, పలుకుబడి మీద అపార నమ్మకమున్నవాడు, లౌక్యుడు.

7.ప్రసాద్ (28సం॥): ఆనందరావు కొడుకు. తండ్రికి మించిన కొడుకు.

8.శశిభూషణ్ (28 సం॥): అగర్భ శ్రీమంతుడు-విద్యావంతుడు. సన్మానాలు జరపటం సరదా.

9.పూర్ణయ్య(60సం॥): సినీమా ప్రొడ్యూసర్. సినీమాలు తియ్యడం సమాజాన్ని మరమ్మత్తు చెయ్యడానిక్కాదనీ రెండున్నర గంటలసేపు ప్రేక్షకుల్ని రంగుల కలల్లో ముంచి మత్తెక్కించి డబ్బు సంపాదించటానికేనని మనసావాచా నమ్మేడు.

10.నళిని (2 సం॥): స్వతంత్రాభిప్రాయాలున్న యువతి. రాజకీయ తీవ్రవాదుల ఉద్యమంలో చేరేక దానిస్వరూపం తెలుసుకుంది.

11.నిరంజన్ (30సం॥): భార్యని చంపిన నేరానికి జైలుపాలై, జైల్లోంచి తప్పించుకుని తీవ్రవాదులముఠాకి నాయకుడయ్యాడు.

12.కిషన్(24సం॥): చదువు మధ్యలో రాజకీయాల్లో అభిరుచి పెరిగి తీవ్రవాదిగా తయారై జైలు పాలైన విద్యార్థి.

### ఒకటవ రంగం

కొం: నమనస్కారం మంజులగారూ!

మం: నమస్కారం.

కొం: నాపేరు చలం.

మం: బాగుంది. నాజూకైన పేరు. ఏం పనిమీద వచ్చేరు?

కొం: అద్దెకుండటానికి మీ ఇంట్లో ఓ వాటా...

మం: కాళీలేదండి. ఇచ్చేశాం. (టెలిఫోన్ గంట విని) ఎక్స్‌క్యూజ్ మి (రిసీవర్ అందుకుని) ఎస్ స్పీకింగ్. లైనివ్వండి. హాయ్ నళినీ! నువ్వు చెప్పిన కొండా, పర్వతం ఇంతవరకూ రాలేదు. నువ్వు చెప్పేక ఎవరికిస్తాను?..ఇటీజ్ రిజర్వ్‌డ్ ఫర్ హిం. ఆఁ! ఛాలెంజ్ చేశాడా? అబ్బే నేను రోగం కుదురుస్తా. డోంట్ వర్రీ. రైటో ఆల్ ది బెస్ట్... పరీక్షలవ్వగానే ఇక్కడికొచ్చెయ్యి... బైబై (రిసీవర్ పెట్టేసి) సారీ సర్! ఇవుడు వచ్చిన టెలీఫోన్ కాల్ కూడా అదే. విన్నారుగా?

కొం: విన్నాను. అందుకే స్టేషన్‌లో రైలుదిగి డైరెక్ట్‌గా మీ ఇంటికొచ్చేశాను. పెట్టీ బెడ్డింగ్ బయటున్నాయి.

మం: మా ఇంట్లో పోర్షన్ ఖాళీగా ఉందని తెలిసి, సామాన్లు తెచ్చుకువచ్చేననడం ధర్మంకాదు.

కొం: నన్ను కొంచెం మాట్లాడనిస్తారా?

మం: నేను వినాలన్న పట్టింపు లేకపోతే మట్లాడచ్చు. నేను రాసుకుంటూంటాను.

కొం: నిరభ్యంతరంగా రాసుకోండి. ముందు ఈ వాటా తాళం చెవి ఇలా పడెయ్యండి.

మం: వాట్డూయూ మీన్ బై దిస్?

కొం: అయ్ మీన్ టు ఇన్ఫార్మ్ యు దట్ అయామ్ యువర్ ప్రోస్పెక్టివ్ టెనెంట్.

మం: హౌ డు యు మీన్?

కొం: నాపేరు కొండా వెంకట చలం. వాడుకలో నాకున్న పేర్లు- వి.సి.కొండా లేకపోతే కె.వి. చలం.

మం: గుడ్ హెవెన్స్! మరి అలా చెప్పరే!

కొం: నన్నసలు చెప్పనిస్తేగా?

మ: నళిని మీ పేరు కొండా అని చెప్పింది.మీరేమో...

కొం: చలం అన్నాను. నాజూగ్గా ఉందని అభినందించేరు!

మం: నాజూగ్గానే ఉంది కాని వ్యాకరణయుక్తంగా లేదు. చలంకాదు అచలం అని పెట్టుకునుండాలి.

కొం: కొండ అన్నా, అచలం అన్నా ఒకటే కదా! రెండువైపులా అచలం ఎందుకని ఓ వైపున చలం అని పెట్టుకున్నాను. (లోపల్నుంచి హాల్లో కొస్తున్న గోపాలకృష్ణయ్యని చూసి) నమస్కారం.

గో: నమస్కారం. ఎవరు బాబూ?

మం: మా ఫ్రెండ్ నళిని ఉత్తరం రాసిందని చెప్పేనుచూడు...ఆయనే ఈయన. మిస్టర్ కొండా.

గో: సామాన్లు లోపల పెట్టుకున్నారా?

కొం: లేదండి. బయటే ఉన్నాయి. ఇంకా తాళం ఇవ్వలేదు.

మం: ఇప్పుడే తెచ్చిస్తా.

గో: ఏంజేస్తున్నావు బాబూ?

కొం: రీజినల్ రిసెర్చ్ లేబరేటరీలో ఉద్యోగం వచ్చిందండి.

గో: సంతోషం. ఇక్కడ నువ్వొక్కడివే ఉంటావా? నీతోబాటు నీ చెల్లెలు కూడా ఉంటుందనుకొన్నాన్నాం.

కొం: నాకు భయంలేదండి. ఒక్కణ్ణీ ఉండగలను.

గో: నీకు భయం లేదనుకో. ఈ ఇంట్లో నేను బయటికెడితే మాఅమ్మాయి ఒక్కర్తీ ఉంటుంది.

కొం: ఏమీ ఫర్వాలేదండి.నాకు కరాటే ఫిష్ట కూడా వచ్చు.

మం: ఇదిగోనండి తాళం చెవి.

కొం: థేంక్స్. మీ నాన్నగారేదో సంకోచిస్తుంటే...

మం: సంకోచాల్లేవు. సందేహాల్లేవు.

గో: చూడు బాబూ. ఈ ఇంట్లో ఉంటానన్నావు కనక కొన్ని నియమాలు పాటించాలి.

కొం:చెప్పండి.

గో: రాత్రి తొమ్మిది గంటలకి మెయిన్ గేట్ తాళం వేసేస్తాను.

కొం నేను సాయంత్రం ఏడుగంటల్లోగానే ఇంటికి వచ్చేస్తాను.

గో: మరి రాత్రిభోజనానికి బయటికెళ్ళవా?

కొం: వెళ్ళనండి. రెండు పూటలా నేనే వంట చేసుకుంటాను.

మం: పిండి రుబ్బుకోవాలన్నా, పచ్చడి చేసుకోవాలన్నా మా గ్రయిండర్ వాడుకోవచ్చు.

కొం: థేంక్యూ వెరీ మచ్. మంజులగారూ!

గో: మా అమ్మాయి ఎప్పుడూ ఏదో రాసుకుంటోనో, చదువు కుంటూనో ఉంటుంది. మరి ప్రశాంతతకి భంగం లేకుండా తరచు బంధువులు. స్నే. హితులు...

కొం: ఎవ్వరూ రారు. రానివ్వను. అలాంటి ప్రశాంతతే నాకూ అవసరం. అంచేతనే మీ ఇంట్లో వాటా అంటే రెక్కలు కట్టుకు వాలేను.

మం: పొద్దున్నా సాయంత్రం స్వయం పాకం, మధ్యాహ్నం ఉద్యోగం. చాలా బిజి లైఫ్ అనుకుంటా.

కొం: అవునండి. మరిక సామాన్లు లోపలికి తెచ్చుకుంటాను.

మం: శుభం.

గో: (కొండా బయటనుంచి పెట్టీ, బెడ్డింగులు తెచ్చుకుని తన వాటాలో ప్రవేశించేక రహస్యంగా) ఏమిటమ్మా ఇతని ధోరణి? ఇదంతా నిజమే నంటావా?

మం: పచ్చినిజంనాన్నా! నాకు నళిని చెప్పింది.తెలివైన వాడట. కష్టపడి పైకొచ్చేట్ట. పుస్తకాల పురుగుట. ఎక్సెంట్రిక్ ఫెలో. ఇతనికి నా రచనలంటే ఒళ్ళుమంటట. ఇతని మనస్తత్వాన్ని స్టడీచేసి ఇతనికో గుణపాఠం చెప్పాల నని నళినికి మాటిచ్చేను.

గో: ఇతని గొడవ మనకెందుకు! చెల్లెల్ని తీసుకు వచ్చి ఉంటాననంటే ఇల్లిచ్చేం. ఇప్పుడూ ఒక్కడూ ఉంటాట్ట.

మం: వంట చేసుకుని ఇంట్లోనే పడుంటాట్ట. ఉండనీ. సాయంగా ఉంటాడు. వెర్రి వెర్రి వేషాలేస్తే అప్పుడే కాళీచేసి పొమ్మనొచ్చు.

గో: లోకులు కాకులు. పదిమందీ పదిరకాలుగా అనుకుంటారు. ఈ వాటా అద్దెకివ్వడమే తప్పు. ఇతని మనస్సు గురించి ఆరా తియ్యాలనుకోడం మరో తప్పు. రెండు మూడు రోజులు పోయాక మంచి మాటలు చెప్పి మరో ఇల్లు చూసుకోమనడం మంచిదేమో ఆలోచించు. నేనలా బేంక్ కెళ్ళొస్తా.

మం: మాట కొంచెం పెళుసు కాని. మనిషి చాలా మంచివాడని నళిని చెప్పింది. కొన్నాళ్ళు చూద్దాం. లేకపోతే అప్పుడే పంపించెయ్యొచ్చు.

కొం: (లోపల్నుంచి బయటకొచ్చి) ఇదిగో సార్ చెక్. ఓ నెల ఎడ్వాన్స్.

గో: దీనికేం తొందరొచ్చిందీ?

కొం: అదేమన్నమాటండీ? ఇది నా ధర్మం. ఇంత మంచి పోర్షన్ దొరకడం నా అదృష్టం.

గో: ఇలా కచ్చితంగా ఉండటం నాకూ ఇష్టమే. కాని, బాబూ, మాకు డబ్బు ముఖ్యంకాదు.

కొం: అద్దె విషయంలోనే కాదు. మీరు పెట్టిన షరతుల విషయంలో కూడా అంత కచ్చితం గానూ ఉంటాను. నా మాట నమ్మండి. ఈ ఇంటి భద్రతని. గౌరవాన్నీ కాపాడే పూచీ నాది.

గో: చాలు బాబూ. ఆ మాట చాలు... అమ్మాయ్! నేనలా ఊళ్ళో కెళ్ళి ఓ గంటలో వస్తాను.

మం: వెళ్ళిరా నాన్నా!


కొం: ఊఁ...ఇల్లు కాళీచేసి పొమ్మందామని మీ నాన్నగారూ, కొన్నాళ్ళు పోయేక చూద్దామని మీరూ తర్జన భర్జన చేస్తున్నారు. నన్ను గురించేనా?


మం: ఓ మీవి పాము చెవులన్న మాట! ఇంతకీ ఇదేమంత రహస్యం కాదు. మా నాన్నగారు పెద్దవారు. ఆయనకేవో సంకోచాలూ, భయాలు సహజం. మీరు ఇల్లు ఖాళీ చెయ్యవల్సిన పరిస్థితి రాదులెండి. నాకా నమ్మకముంది.

కొం: అలాంటి పరిస్థితొస్తే మీ మూలాన్ని రావాలి కాని నా మూలాన్ని రాదు. బై ది బై... ఇందాకనే చెబుదామనుకున్నాను. మీ నాన్నగారున్నారని తటపటాయించేను. చూడండి. మీ కీ డార్క్ కలర్ శారీ, బ్లౌజూ ఏమీ బాగా లేవు. మీ కాంప్లెక్షన్‌కీ తగని లైట్ బ్లూ, లైట్ పింక్, లేకపోతే ఆలివ్ గ్రీన్ శారీస్. వాటికి తగ మేచింగ్ బ్లౌజెస్ బాగుంటాయి.

మ: (కళ్ళెర్రజేస్తూ) హౌ డేర్ యు టాక్ లైక్ దిస్?

కొం: డోంట్ గెట్ ఎక్సయిటెడ్! నేనేమీ తప్పు మాటనలేదు. తిట్టలేదు.






అందమైన మనిషి కదా అని నాకునచ్చిన సలహాలు ఇచ్చేను. నేను చేసిన మహాపరాధమేమిటంటే నిర్మొహమాటంగా నిజం చెప్పడం. అసలు ఆ చీర ఏం బాగుందని కొన్నారు?

మం: నా ఇంట్లో నా ఇష్టమొచ్చిన చీర నేను కట్టుకుంటాను.

కొం: ఇది ఇప్పుడు మీ ఇల్లే కాదు. నా ఇల్లు కూడాను. మనిద్దరి ఇల్లును. నేను నా వాటాలో కెళ్ళాలంటే ఈ హాల్లోంచి వెళ్ళాలి. అంచేత ఇక్కడ మనుషులు, వస్తువులు అందంగా, ఆకర్షణీయంగా ఉండాలనుకోడం దురాశ కాదనుకుంటాను. ఇది నా ఇల్లు, నా ఇష్టమొచ్చినట్టు నేనుంటాను అంటే ఇటీజ్ బార్బేరిజం. అనాగరీకులనవల్సిన మాట. ఇది మనం ఉమ్మడిగా ఉపయోగించుకునే హాలు. మీ గదిలో కెళ్ళి మీ ఇష్టమొచ్చిన చీర కట్టుకోండి. మానుకోండి. అది మీ ఇష్టం.

మం: మిస్టర్ కొండా! ఇటీజ్ ది లిమిట్. చూడండి...

కొం: చూసింది చాలు. మరో విషయం. దార్లో ముళ్ళకంపలాగ ఈ పాతకుర్చీ ఏమిటి. తీసవతల పారెయ్యండి. నాకు శ్రమ తప్పుతుంది....ఓహ్! వాట్ ఎ వేస్ట్!

మం: గెటవుటాఫ్ మై హవుస్.

కొం: హోల్డ్ యువర్ టంగ్. పేరు ప్రఖ్యాతులున్న రచయిత్రిననా? ఈ ఇంటి యాజమానురాలిననా? ఏమిటి మీ అహంకారం! ఇంట్లో ఓ వాటా అద్దెకిచ్చేక అందులో ఉన్న సాటిమనిషిని గౌరవించడం సంస్కారం.

మం: మీ సంస్కారమేమిటో తెలుస్తూనే ఉంది. మీతో వాదించడం అనవసరం. మీరు ఇల్లు ఖాళీ చేసివెళ్ళిపొండి.

కొం: ఇల్లు కాళీ చెయ్యను. మధ్యాహ్నం లారీలో నా సామాన్లు దిగుతాయి.

మం: మర్యాదగా కాళీ చేసి వెడతారా లేక పోతే దౌర్జన్యంగా ఈ ఇంట్లో ప్రవేశించిఅల్లరిచేస్తున్నారని పోలీసులకి ఫోన్ చెయ్యమంటారా?

కొం: ఇంకా నయం. మిమ్మల్ని మానభంగం చెయ్యడానికి ప్రయత్నిస్తున్నట్టు కూడా ఫోన్ చెయ్యగలరు! మీరు రచయిత్రి కదా! మీ కల్పనాశక్తి అమోఘం. అలాంటి తెలివితక్కువ ఆలోచనలు కట్టిపెట్టండి. ఈ వాటా మీరు ఇష్టపడే నాకు అద్దెకిచ్చేరనడానికి- ఒకటి- మీరు నళినికి రాసిన ఉత్తరం నా దగ్గిరుంది. రెండు-ఈ వాటా తాళం చెవి నా దగ్గిరకెలా వచ్చిందంటే ఏంచెప్తారు? మూడు-ఈ పాటికి నే నిచ్చిన చెక్ మీ నాన్నగారు మీ ఎకౌంట్‌లో క్రెడిట్ చేసుంటారు. ఈ సాక్ష్యాలు చాలా? పోలీసు డిపార్ట్‌మెంటు ఇదంతా విన్నాక మిమ్మల్నెంత మెచ్చుకుంటారో ఆలోచించండి.

మం: జరిగిందేదో జరిగిపోయింది. మీ డబ్బు మీ కిచ్చేస్తాను. మన అభిరుచులు వేరు. మన మనస్తత్వాలు వేరు. మనం ఒకే ఇంట్లో ఉండలేం.

కొ: ఎందుకుండలేం? ఆ పాత కుర్చీ తీసి అవతల పారెయ్యండి. నా లగేజ్ వచ్చేక ఓ మాంచి కుర్చీ అక్కడ వేస్తాను. ఇంక చీర విషయంలో అన్నారా? నే చెప్పవలసింది చెప్పేను. ఆపైన మీ ఇష్టం. అలాగే ఏదో ఎడ్జెస్టయి పోవాలి.

మం: ఎడ్జస్ట్ అవలేకపోతే?

కొం: అప్పుడే మీరు మరో ఇల్లు చూసుకుందురుగాని...వస్తా (తలుపేసుకుంటాడు.)

మం : యూ బ్లడీ బ్రూట్! హుఁ! ఎంత పొగరు!

** ** **

## రెండవ రంగం

కొం: (హాల్లో కూర్చుని పేపరు చదువుకుంటూ తనలో తను) ఏమిటీరోజున ఇంకా దేవతా దర్శనం కాలేదు! ఇదిగో తలుపులు తెరుచుకున్నాయి. తెర తొలగింది. అదిగో ధుమధుమాలంకృత సుందరవదనారవిందం! (పైకి) గుడ్ మార్నింగ్.

మం: గుడ్ మార్నింగ్. (ఓక్షణం తరువాత) తీర్గుబడిగా కూర్చున్నారు. వంట అప్పుడే **అయి** పోయిందా?

కొం: యూ లుక్ సో ఛార్మింగ్ ఇన్ దట్ శారీ...ఆఁ..ఏమిటన్నారు. వంటా? ఇవ్వాళ సెలవురోజుకదా. ఓ స్నేహితుడు భోజనానికి రమ్మన్నాడు. అంచేత ఈరోజు వంటింటికి సెలవిచ్చేశాను.

మం: రాత్రి భోజనం బయటేనా?

కొం: ఎవరేనా పిలుస్తే బయటే. లేకపోతే రెండరటిపళ్ళు తినేసి, మజ్జిగ తాగి పడుకుంటాను.

మం: అవున్లెండి. ఆదా కూడా చెయ్యొచ్చు.

కొం: ఇలా ఎంత ఆదా చెయ్యగలుగుతాను? దిక్కుమాలిన ఇంటద్దె ఎంత

మింగేస్తుందో ఆలోచించండి. వెధవది రెండుగదులూ. వంటిల్లు? దీనిమొహాన్ని అయిదువందలు పోస్తున్నాను.

మం: ఇంటద్దె ఖర్చు లేకుండా నిత్యం మిమ్మల్ని మేపే ఫ్రెండ్సెవళ్ళైనా ఉంటే చూడండి. జీతమంతా బేంక్‌లో వేసుకోవచ్చు.

కొం: ఫ్రెండ్సంటే ఎక్కణ్ణుంచైనా ఊడిపడతారా? స్నేహం చేస్తే, స్నేహితులౌతారు. మన స్నేహం ఇలాగే దినదిన ప్రవర్ధమానంగా పెరిగిందంటే రేపోమాపో మీరే అనొచ్చు. మీరు అద్దె ఇవ్వడమేమిటండీ! మీరు మా కుటుంబంలో మనిషిలాంటివారు. మీరింకిలా కాలు కాల్చుకోడం కూడా మానెయ్యండి. మాతోబాటే మీరు ఇక్కడే తిందురుగాని అని బలవంతం చెయ్యొచ్చు.

మం: అలాగే కలలు కంటూ కూర్చోండి. దానధర్మాలుచేసినా పాత్ర ఎరిగి చెయ్యడం మా సంస్కారం. ఊరుమీద పడి మేసి డబ్బు దాచుకునే వాళ్ళని పోషించి మహాపాపాని కొడిగట్టం. నళిని చెబితే ఏమిటో అనుకున్నాను. మీరు పెళ్ళెందుకు చేసుకోటంలేదో అర్థమైంది. యు ఆర్ ఏ నిన్‌కారిబుల్ మైజర్. పరమపిసినికొట్టు.

కొం: (జానకి రావడం, దగ్గడం గమనించి) ఏమిటో మీ అభిమానంతో నన్నిలా పొగుడుతారుకాని, ఈ విషయంలో మీ ముందునేనెంతవాణ్ణి!

జా: నమస్కారమండీ, నేను జానకిని.

మం: నమస్కారం. రండి కూర్చోండి. ఏమిటి విశేషం?

జా: మిమ్మల్ని కలుసుకోడానికీ, చెప్పడానికీ కూడా సిగ్గుగా ఉంది. మీకు టెలిఫోన్ చేసి వద్దామనుకున్నాను. కాని మీ టెలిఫోన్ పనిచెయ్యటంలేదు.

మం: ఫరవాలేదు చెప్పమ్మా.

జా: రాకూడదనుకున్నా మళ్ళీ మీ దగ్గిరికి అప్పుకోసం రాకతప్పలేదు. ఇదివరకు రెండుసార్లు సాయంచేశారు. కిందటినెల నుంచీ ఇంటద్దె పెంచేశారు. ఒక్కరెండువందలు సర్దుతే... వచ్చే నెల నుంచి వాయిదాలలోనైనా...

మం: చూడమ్మా జానకీ! ఇలా నేను మాత్రం ఎన్నిసార్లివ్వగలను?

జా: చుట్టుపక్కల వాళ్ళు అయ్యోపాపం అనే వాళ్ళేకాని సాయంచేసిన వాళ్ళులేరు. అంచేతనే అభిమానం చంపుకునిమళ్ళీ మీ దగ్గిరకొచ్చాను. ఇదే ఆఖరిసారి.

మం: ప్రాయర్ సారుగుతీసి మళ్ళీ మూస్తూ. ఇదిగో ఈ రెండువందలూ తీసుకోండి. మళ్ళీ తిరిగివ్వక్కర్లేదు.

జా: థేంక్సండీ. మీ మేలు మరిచిపోలేను.

కొం: ఆగండి.

జా: ఏవరు? నేనా?

కొం: అవును. ఒక్క నిమిషం ఇలా కూర్చోండి.

జా: నిలబడగలను చెప్పండి.

కొం: మీరెక్కడుంటున్నారు?

జా: ఈ కాలనీలోనే. వెనక వీధిలో ఉంటున్నాం.

కొం: మీ రెంతవరకు చదువుకున్నారు?

జా: ఇంటర్ చదువుతూ మానేశాను.

కొం: ఎంతమంది పిల్లలు?

జా: ఇద్దరు. బాబు అయిదో క్లాసులోనూ, పాప రెండో క్లాసులోనూ చదువుకుంటున్నారు.

కొం: మీ భర్త ఏం చేస్తున్నారు?

జా: ప్రయివేట్ కంపెనీలో ఎకౌంటెంట్‌గా పని చేస్తున్నారు. నెలకి వెయ్యి రూపాయలు సంపాదిస్తున్నారు.

కొం: ఇంటద్దె ఎంత?

జా: కిందటి నెలవరకూ మూడొందలు. ఇప్పుడు నాలుగొందలు చేశారు.

కొం: దారుణం. ఈ ఇళ్లు గలవాళ్ళంతా ఇంతేనండి. ఇంట్లో దిగే వరకూ మర్యాదగా ఉంటారు. తరువాత రాక్షసుల్లా ప్రవర్తిస్తారు.

మం: మిస్టర్ కొండా! ఇంకా మీరడగవల్సిన చొప్పదంటు ప్రశ్నలున్నాయా? చెయ్యగలిగితే సాయం చెయ్యండి, లేకపోతే వెళ్ళనివ్వండి. అయినా ఆవిడ నా కోసం వచ్చింది. వచ్చిన పనయ్యింది.

కొం: మిసెస్ మంజులా! ఆవిడ కో రెండువందలిచ్చి మహోపకారం చేశాననుకుంటున్నారు. ఆవిడకి ఎంత అపకారం చేస్తున్నారో మీకు తెలీదు. అంచేత మీరు కాస్త....నోరు...అదుపులో పెట్టుకుంటారా!

జా: క్షమించండి. ఇంత మర్యాదలేకుండా మాట్లాడే మీ ప్రశ్నలకి సమాధానం చెప్పే అవసరం నాకు లేదు. మీ సాయం నేను కోరలేదు.

కొం: చూడండి జానకిగారూ! నా కో అక్కయ్య మీ పరిస్థితుల్లో వుంటే ఆమె తన ఆర్థిక సమస్యను ఏవిధంగా పరిష్కరించుకోవాలో ఆలోచిస్తున్నాను.



అందుకే ఇన్ని ప్రశ్నలు వేశాను.

జా: సంసారం అన్నాక ఒడుదుడుకు లుంటాయి. మంచిరోజులు రాకపోవు. మా సమస్యల్ని మేము పరిష్కరించుకోగలుగుతాం.

కొం: ఇలాగే ఉంటే పరిష్కరించుకోలేరు. రానురాను మీ సమస్య క్లిష్టతరమవుతుంది. పిల్లల పోషణ. చదువులు. పుస్తకాలు. రోగాలు. పెంచే ఇంటద్దె. పెరిగే ధరలు. మిమ్మల్ని చూసి మొహం చాటేసే బంధువులు. స్నేహితులు...

మం: మీ తెలివితేటలు అమోఘం! ఆమె పరిస్థితిని ఎంత చక్కగా వివరించారు! ఇంతకీ ఆ పరిస్థితుల్లో మీ అక్కయ్యుంటే ఏం చెయ్యమనేవారో అది చెప్పరా!

కొం: చెయ్యమనేవాణ్ణి కాదు. చేయించేవాణ్ణి. చూడండి జానకిగారూ! ఆంధ్ర మహిళా సమితి ఉంది. దాని సెక్రటరీ ప్రతిభాదేవికి ఉత్తరం రాసిస్తాను. వెళ్ళి కలుసుకోండి.

జా: ఆవిణ్ణి కలుసుకున్నాను. టెయిలరింగ్, అల్లిక పనులు. అగరొత్తులు కొవ్వొత్తులు. కాగితం సంచులు చెయ్యడం, పిండి వంటలు, ఊరగాయలు. అప్పడాలు, ఒడియాలు, ఒరుగులు ఇలాంటి వెన్నో పనున్నాయి. ఏదోపనిలో చేరమన్నారండి.

కొం: మరెందుకు చేరలేదు?

జా: ఆయన కిష్టంలేదండి.

కొం: ఏ చదువూలేని వాళ్ళుకూడా పుల్లలేరుకునో, పిడకలు చేసుకునో, కూలీనాలీచేసుకునో, పువ్వులూ, పళ్ళూ, కూరలు అమ్ముకునో ఎంతో కొంత సంపాదిస్తున్నారే! మీరే పనీ చేసి రెండు మూడు వందలు సంపాదించుకోలేరా?

మం: ఈవిడ మీ అక్కయ్యే అనుకుని ఏం చెయ్యాలో చెప్పండి.

కొం: మిసెస్ మంజులా! మీరు రాసిన 'గుప్పెడు గింజలు' నవలలో సుశీల పాత్ర గుర్తుకు తెచ్చుకోండి. ఆ సుశీల కథకీ, ఈ జానకి జీవితానికి దగ్గిర పోలికల్లేవూ? భర్త సంపాదన చాలక, బంధువుల ఆదరణలేక, అప్పు పుట్టక, అవమానాలు భరించలేక చివరికి ఏం చేసిందీ? పిల్లలకి విషం ఇచ్చీ, తనూ విషం తాగి చచ్చింది. ఇప్పుడు మీ నవల ద్వారా జానకి గారికిచ్చే సందేశం అదేకదా!

మం: మిస్టర్ కొండా! నా నవలలు చదివేరంటే... అయ్ అప్రీషియేట్ యువర్ లిటరరీ టేస్ట్. ఈనాటి సమాజంలో తోటి స్త్రీకి కలిగే కష్టాలు తెలిసిందాన్ని కనకనే ఈమెకి చెయ్యగలిగిన సహాయం చేశాను.

(సశేషం)